
JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి | మంగళవారం 03-02-2026
Medchal - Malkajgiri | Tuesday 03-02-2026
Follow: jayabherinews
సంపుటి : 02 | సంచిక : 248
పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 248 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com


## ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే
# మళ్లీ ఉద్యమ రోజులు

- దావోస్ ఒప్పందాల ద్వారా వచ్చిన పెట్టుబడులపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్
- ఫోన్ ట్యాపింగ్ కేసులో వారు చెబుతున్న అబద్ధాలు ఒక్కటొక్కటి తేలిపోతున్నాయి
- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో వచ్చిన అభియోగాలపై కోర్టులు తేల్చుతాయి
- హైదరాబాద్ నగరంలో పట్టబగలు కాల్పులు, దోపిడీ ఘటనలు చోటు చేసుకుంటున్నాయని కేటీఆర్ ఆందోళన
- బొగ్గు కుంభ కోణంపై సిట్టింగ్ జడ్జి, సీబీఐ విచారణ కోరుతుంటే ఎందుకు వెనక్కి పోతున్నారు



**జయభేరి, హైదరాబాద్, ఫిబ్రవరి 2 :**

ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన అవసరం తమకు లేదని, ఈరోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమాచారం ఎలా వస్తుందో, నాడు కేసీఆర్ ప్రభుత్వానికి కూడా అలాగే వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ నిన్న రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, పట్టణాలలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కదిలారని అన్నారు. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే మళ్లీ ఉద్యమ రోజులు గుర్తుకువస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో పాలనా వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని, మేడారం జాతర ఏర్పాట్లలో కూడా ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ...మిగతాది 2 లో

# సంయమనంతో ఉండండి

- వైసీపీ ట్రాప్లో పడొద్దన్న చంద్రబాబు



**జయభేరి, విజయవాడ, ఫిబ్రవరి 2 :**

ఆంధ్రప్రదేశ్‌లో హింసను ప్రేరేపించటానికి వైసీపీ కుట్రలు పన్నుతోందని ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఇటీవల జరుగుతున్న పరిణామాలను గమనిస్తే అధికారం కోల్పోయామనే అసహనంతోనే వైసీపీ నేతలు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్నారని, ఏపీలో అలజడి సృష్టించేందుకే ఆ పార్టీ నేతలు బూతులు మాట్లాడుతున్నారని చంద్రబాబు అన్నారు. సోమవారం నాడు టీడీపీ అధినేత చంద్రబాబు మంత్రులు, ...మిగతాది 2 లో

## హార్వర్డ్ లో నాలుగు రోజులు చదువుకున్నా..
# రేవంత్ గుణం మాత్రం మారలేదు




**జయభేరి, హైదరాబాద్ :**

సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీష్‌రావు ధ్వజం ఎత్తారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి హేట్ స్పీచ్పై హితబోధ చేసిన కొద్ది నిమిషాలు కూడా గడవకముందే, అదే వేదికపై రేవంత్ రెడ్డి తన అసలు స్వభావాన్ని, తన మాటల ద్వారానే బయటపెట్టుకున్నారు.




తెలంగాణ ప్రజల స్వేచ్ఛ కోసం, పేదల హక్కుల కోసం పోరాటం చేయడమే కాదు, సర్వం త్యాగం చేసిన మహనీయుడు రావి నారాయణ రెడ్డి. న్యాయ వ్యవస్థ ద్వారా ప్రజల హక్కుల కోసం పని చేసిన, రాజ్యాంగం పట్ల సంపూర్ణ నిబద్ధత కలిగిన జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డికి ఈ అవార్డు ప్రదానం చేయడం అత్యంత సముచితం. నేడు దేశంలో రాజ్యాంగ పరిరక్షణ కోసం, ప్రజల ఓటు హక్కు రక్షణ కోసం, ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం రావి నారాయణ రెడ్డి స్ఫూర్తితో పని చేయాల్సిన అవసరం ఉంది.


# పేద ప్రజల కోసం భూ దానం

> భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన సమరయోధుడు రావి నారాయణ రెడ్డికి తెలంగాణ సమాజంలో ప్రభుత్వం సముచిత స్థానం కల్పిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

- దేశంలో మొట్టమొదటి ప్రధాని నెహ్రూ కంటే ఎక్కువ మెజారిటీతో పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యారు
- మున్సిపల్ ఎన్నికల అనంతరం రావి నారాయణ రెడ్డికి సముచిత గౌరవం ఇచ్చేందుకు చేపట్టాల్సిన చర్యలు

**జయభేరి, హైదరాబాద్ :**

రావి నారాయణ రెడ్డి చరిత్రను పాఠ్యాంశంగా చేర్చడం, వారి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం వంటి అంశాలపై అందరితో చర్చించి, వారి గౌరవాన్ని పెంచేందుకు మంత్రిమండలిలో నిర్ణయం తీసుకుని సముచితమైన స్థానం కల్పిస్తామని వెల్లడించారు. 'తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు' ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు, పద్మవిభూషణ్ 'రావి నారాయణ రెడ్డి స్మారక జాతీయ పురస్కారం - 2025'ను ముఖ్యమంత్రి చేతుల మీదుగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "అరాచక శక్తులకు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించిన మహనీయుడు రావి నారాయణ రెడ్డి. భూస్వామ్య కుటుంబంలో పుట్టినా, పేద ప్రజల కోసం తన 500 ఎకరాల భూమిని దానం చేసిన గొప్ప వ్యక్తి. 'బండెనక బండి కట్టి, పదహారు బండ్లు కట్టి' అని తెలంగాణ సమాజాన్ని చైతన్యం చేసిన బండి యాదగిరి లాంటి నిరక్షరాస్యులను కూడా ప్రభావితం చేసిన గొప్ప నాయకుడు. దేశంలో మొట్టమొదటి ప్రధాని నెహ్రూ కంటే ఎక్కువ మెజారిటీతో పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ప్రజా తీర్పును ప్రతిబింబించేలా ఆనాడు మొట్టమొదటి పార్లమెంట్ భవనాన్ని రావి నారాయణ రెడ్డితో నెహ్రూ ...మిగతాది 2 లో





## ఆదానీ గ్రూప్ కు టోకరా

- ఆదానీ గ్రూప్‌కు చెందిన ప్రముఖ సిమెంట్ తయారీ సంస్థ ఏసీసీ లిమిడెట్‌ను టార్గెట్ చేస్తూ జరిగిన ఒక భారీ మోసం
- రూ.1.96 కోట్లను నిందితులు ఉద్దేశపూర్వకంగా ఎగ్గొట్టారు

**జయభేరి, హైదరాబాద్, ఫిబ్రవరి 2 :**

వైట్ కాలర్ నేరాలు రోజురోజుకూ సరికొత్త పుంతలు తొక్కుతున్నాయి. సామాన్యులను ముంచే చిన్నపాటి చీటింగ్‌ల నుంచి ఏకంగా అగ్రశ్రేణి కార్పొరేట్ సంస్థలనే బురిడీ కొట్టించే స్థాయికి నేరగాళ్లు ఎదిగారు. తాజాగా ఆదానీ గ్రూప్‌కు చెందిన ప్రముఖ సిమెంట్ తయారీ సంస్థ ఏసీసీ లిమిడెట్‌ను ...మిగతాది 2 లో



# ప్రపంచ నగరాలతో పోటీ పడే లక్ష్యం

**జయభేరి, హైదరాబాద్ :**

ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు సమర్ధవంతంగా చేరవేయడంలో ప్రజా సంబంధాల శాఖ పాత్ర అత్యంత కీలకం. ఆధునీకరించిన సమాచార పౌర సంబంధాల శాఖ వెబ్‌సైట్‌ను డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఐ&పిఆర్ కమీషనర్ సిహెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి సీపీఆర్‌వో జి.మల్సూర్, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్, సంబంధిత అధికారులతో కలిసి ప్రారంభించడం జరిగింది.

తెలంగాణలో ప్రజలు ఏ మార్పు కావాలని కాంగ్రెస్ ప్రజాపాలనను కోరుకున్నారో, ఆ దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే స్పష్టంగా చేసి చూపించి వారి విశ్వాసాన్ని, నమ్మకాన్ని నిలబెట్టుకుంది. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ తో ఒకవైపు ప్రపంచ నగరాలతో పోటీ పడే లక్ష్యాలను నిర్దేశించుకొని మరోవైపు పేదల ఆకాంక్షలు తీర్చే సంక్షేమ ఫలాలు అందిస్తూ, ద్విముఖ వ్యూహంతో పాలనలో పారదర్శకత, అభివృద్ధిలో ఆధునికత, సంక్షేమంలో సరికొత్త చరిత్రను రాస్తూ పాలన సాగుతోంది. ఈ మార్పులను ప్రజలకు సమర్ధవంతంగా చేరవేయడంలో ప్రజా సంబంధాల శాఖ పాత్ర ఎంతో కీలకం. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడుకొని ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు వేగవంతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించడం జరిగింది.

▶▶ మొదటిపేజీ తరువాయి

## పేద ప్రజల కోసం భూ దానం

ప్రారంభింపజేశారు. 60 ఏళ్ల వయసులో ప్రజలకు స్ఫూర్తినిస్తూ పార్టీ, రాజకీయ పదవుల నుంచి తప్పుకున్న గొప్ప నేత రావి నారాయణ రెడ్డి. మున్సిపల్ ఎన్నికల అనంతరం రావి నారాయణ రెడ్డికి సముచిత గౌరవం ఇచ్చేందుకు చేపట్టాల్సిన చర్యలు తీసుకుంటాం" అని చెప్పారు. రావి నారాయణ రెడ్డి జాతీయ పురస్కారం జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డికి దక్కడం సముచితమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. "నిర్వాహకులు సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నారు. తొలితరంలో బూర్గుల రామకృష్ణారావు, రావి నారాయణ రెడ్డి స్ఫూర్తినిస్తే, మలితరంలో ఎస్. జైపాల్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి వంటి వారు తెలంగాణ సమాజానికి స్ఫూర్తినిచ్చారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి తెలంగాణ సమాజానికి ఒక స్ఫూర్తిగా నిలిచారు. రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో వారు పోషించిన పాత్ర మనందరికీ గుర్తుంది. వారి అనుభవాలు పరిపాలనలో ఉపయోగపడుతున్నాయి" అని వివరించారు. హైదరాబాద్‌లోని రావి నారాయణ రెడ్డి ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు చాడ వెంకట్ రెడ్డి, కార్యదర్శి కందిమళ్ల ప్రతాప్ రెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు, సీపీఐ నాయకులు నారాయణ, చాడ వెంకట్ రెడ్డి, పల్లా వెంకట్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఇతర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆదానీ గ్రూప్ కు టోకరా

టార్గెట్ చేస్తూ జరిగిన ఒక భారీ మోసం వెలుగులోకి వచ్చింది. కేవలం నకిలీ పత్రాలతో ఒక సినిమా లెవల్‌లో ప్లాన్ చేసి, సుమారు రెండు కోట్ల విలువైన సిమెంట్‌ను కాజేసిన ఈ ఘటన ఇప్పుడు పారిశ్రామిక వర్గాల్లో సంచలనం సృష్టిస్తోంది. లక్కీ భాస్కర్ సినిమాలో బ్యాంకింగ్ లొసుగులను వాడుకుని ఎలా మోసాలు పాల్పడతారో చూశాం. సరిగ్గా అదే తరహాలో బ్యాంక్ గ్యారంటీ అనే ఆయుధాన్ని వాడుకొని నిందితులు అదానీ గ్రూప్‌కు భారీ కుచ్చు టోపీ వేశారు. హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన వివరాల ప్రకారం జేపీ ఇన్‌ఫ్రా అండ్ ఇంజనీరింగ్ అనే సంస్థ యజమాని జ ప్రకాష్ ఇన్నార్తి , అతని సహచరుడు మన్మోహన్ కలిసి ఈ కుట్రకు తెరలేపారు. వీరు పంజాబ్ నేషనల్ బ్యాంకు పేరుతో ఒక నకిలీ బ్యాంకు గ్యారంటీ పత్రాన్ని సృష్టించారు. ఈ పత్రం విలువ అక్షరాల 2 కోట్లు. ఈ నకిలీ బ్యాంకు గ్యారంటీని అసలైనదిగా నమ్మించి, నిందితులు ఏసీసీ లిమిటెడ్, అంబుజా సిమెంట్స్ సంస్థలను సంప్రదించారు. భారీ ప్రాజెక్టుల పేరుతో తమకు సిమెంట్ సరఫరా చేయాలని కోరారు. సదరు బ్యాంక్ గ్యారంటీ నిజమేనని నమ్మిన కంపెనీ యాజమాన్యం, నిందితులకు వివిధ విడతల్లో సిమెంట్‌ను సరఫరా చేసింది. దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం సరఫరా చేసిన సిమెంట్ విలువ 2,02,05,368 రూపాయలు అయితే, నిందితులు చెల్లించిన మొత్తం 5,60,000 రూపాయలు, మోసం చేసిన మిగిలిన మొత్తం 1,96,45,368 రూపాయలు. అంటే రెండు కోట్లకుపైగా విలువైన సరకును తీసుకొని కేవలం నామమాత్రపు సొమ్మును మాత్రమే చెల్లించి, మిగిలిన రూ.1.96 కోట్లను నిందితులు ఉద్దేశపూర్వకంగా ఎగ్గొట్టారు. నిందితుల నుంచి బకాయిలు రాకపోవడంతో ఏసీసీ సంస్థ ఆందోళన చెందింది. చివరికి తమ వద్ద ఉన్న రెండు కోట్ల బ్యాంక్ గ్యారంటీని నగదుగా మార్చుకోవాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో ఏసీసీ ప్రతినిధులు పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను సంప్రదించగా, అక్కడ వారికి పెద్ద షాక్ తగిలింది. నిందితులు సంప్రదించగా అక్కడ వారికి పెద్ద షాక్ తగిలింది. నిందితులు సమర్పించిన ఆ బ్యాంక్ గ్యారంటీ పత్రం తమ బ్యాంక్ నుంచి జారీ కాలేదని, అది పూర్తిగా ఫోర్జరీ చేసిన నకిలీ పత్రమని బ్యాంక్ అధికారులు స్పష్టం చేశారు. దీంతో తాము నిలువునా మోసపోయామని గ్రహించిన అదానీ గ్రూప్ ప్రతినిధులు పోలీసులను ఆశ్రయించారు. ఏసీసీ లిమిటెడ్ రీజినల్ సేల్స్ మేనేజర్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును అత్యంత సీరియస్‌గా తీసుకున్న పంజాగుట్ట పోలీసులు, జనవరి 24న కేసు నమోదు చేశారు. జయప్రకాష్ ఇన్నార్తి, మన్మోహన్, ఇతరులపై బీఎన్ఎస్‌లోని సెక్షన్ 406, 420 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్నట్టు సమాచారం.

## సంయమనంతో ఉండండి

పార్టీ సీనియర్ నేతలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్టీ నేతలు చాలా అప్రమత్తంగా ఉండాలి, ముఖ్యంగా వైసీపీ ట్రాప్‌లో పడొద్దు అని సూచించారు. మాజీ మంత్రులు జోగి రమేష్, అంబటి రాంబాబు కామెంట్లు తరువాత జరుగుతున్న పరిణామాలపై నేతలతో చర్చించారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో వైసీపీ నేతలు అడ్డంగా దొరికిపోయారని, వారిని ఏపీ ప్రజలు, భక్తులు ఛీదరించుకుంటున్నారని చంద్రబాబు పేర్కొన్నారు. తప్పు చేసిన వారికి చట్ట ప్రకారం శిక్ష తప్పదు. వైసీపీ ట్రాప్ లో పడి చట్టాన్ని చేతుల్లోకి మాత్రం తీసుకోవద్దని.. పార్టీ కార్యకర్తలు సంయమనం పాటించేలా మంత్రులు, నేతలు బాధ్యత తీసుకోవాలని చంద్రబాబు సూచించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ఆదేశాల మేరకు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సూచనలతో రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు టెలికాన్ఫిరెన్స్ నిర్వహించారు. నిన్న జరిగిన సంఘటనపై పార్టీ జాతీయ అధ్యక్షులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో చట్టాలను కాలరాస్తూ, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని అరాచక పాలన సాగించారని ఆయన గుర్తు చేశారు. అయితే అలాంటి పాలనను వ్యతిరేకించాం. కానీ ఇప్పుడు మనమే చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం సరైన మార్గం కాదని ఆయన స్పష్టంగా చెప్పారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు చట్టాన్ని గౌరవించే వారిగా సమాజంలో మంచి గుర్తింపు సంపాదించుకున్నారని, అదే మన పార్టీకి ఉన్న బలమైన బ్రాండ్ ఇమేజ్ అని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర బడ్జెట్ 2026 కూడా వికసిత్ భారత్ లక్ష్యాలకు, స్వర్ణాంధ్ర 2047 దిశగా రూపొందించారని తెలిపారు. అమరావతికి రూ.1088 కోట్లు, పట్టణాభివృద్ధికి రూ.452 కోట్లు, గ్రామీణ రోడ్లకు రూ.500 కోట్లు, గూగుల్, రిలయన్స్ డేటా సెంటర్లకు పన్ను రాయితీలు, అరుదైన ఖనిజాల అభివృద్ధికి రూ.1000 కోట్లు కేటాయించారని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పల్లా శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

## ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే..

దావోస్ ఒప్పందాల ద్వారా వచ్చిన పెట్టుబడులపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో వారు చెబుతున్న అబద్ధాలు ఒక్కటొక్కటి తేలిపోతున్నాయని అన్నారు. మొదట వ్యాపారవేత్తలు, ఆ తర్వాత సినిమా తారల ఫోన్లు ట్యాప్ చేశారని చెప్పారని, ఇప్పుడు ఏమీ లేదని అంటున్నారని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన ఖర్మ తమకు లేదని స్వయంగా కేసీఆర్ చెప్పారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఇకనైనా పాలనపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సజ్జనార్ తీర్పు చెప్పడానికి ఆయన జడ్జి కాదని ఎద్దేవా చేశారు. హైదరాబాద్ నగరంలో పట్టపగలు కాల్పులు, దోపిడీ ఘటనలు చోటు చేసుకుంటున్నాయని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సహజ వనరుల దోపిడీ జరుగుతోందని ఆరోపించారు. సింగరేణి కుంభకోణం అంశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి స్పష్టమైన సమాధానం రాలేదన్నారు. బొగ్గు కుంభకోణంపై సిట్టింగ్ జడ్జి, సీబీఐ విచారణ కోరుతుంటే ఎందుకు వెనక్కి పోతున్నారని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో సృజన్ రెడ్డి కాల్ డేటా తీస్తే అన్ని విషయాలు బయటకు వస్తాయని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ నిలదీస్తోందని, అందుకే సిట్‌ల పేరిట విచారణలు చేస్తూ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్‌పై కేటీఆర్ పెదవి విరిచారు. ఉపాధి హామీని కుదించారని, ఎరువులు, ఆహార రాయితీ, స్వచ్ఛ భారత్ నిధులు తగ్గించారని ఆరోపించారు. బయో ఫార్మా తయారీకి రూ.10 వేల కోట్లు కేటాయించిన కేంద్రం హైదరాబాద్‌కు రూ.10 కూడా కేటాయించలేదని విమర్శించారు. ఢిల్లీకి 60 సార్లు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాధించిందేమిటని ప్రశ్నించారు. రెండు పార్టీల నుంచి 8 మంది చొప్పున ఎంపీలు గెలిచినా రాష్ట్రానికి కలిగిన ప్రయోజనం ఏమీ లేదన్నారు.

# విమాన ప్రమాదాలకు అంతం ఎప్పుడు



ఆది అంతమూ లేని ఆకాశాన్ని.. అసలైన స్వేచ్ఛకు ప్రతీకగా మనం భావిస్తూ ఉంటాం. అయితే.. సమున్నతంగా, అనంతంగా వ్యాపించిన ఆ నీలి ఆకాశమే.. జాతిని ముందుకు నడపాల్సిన విలువైన వ్యక్తులను నిర్దాక్షిణ్యంగా చిదిమేసినప్పుడు కలిగే దుఃఖం మాటల్లో చెప్పలేనిది. తనను నమ్ముకున్న అనుచరులు పోటీ చేస్తున్న చోట ప్రచారానికో, దగాపడిన ప్రజలకు ధైర్యం చెబుదామనో, దేశ ప్రగతిని పట్టాలెక్కించే మరో కార్యక్రమం కోసమో.. విమానంలోనో, హెలీకాప్టర్‌లోనో బయలుదేరిన నేతలు ప్రమాదాల వల్ల ప్రాణాలు కోల్పోయినప్పుడు.. అది చెప్పలేని విషాదంగా పరిణమిస్తుంది. దేశ గమనాన్ని మార్చి, కోట్లాది జాతిజనుల కలలకు ప్రతీకలుగా నిలిచిన ఆ వ్యక్తులు ఈ ప్రపంచం నుంచి మాయమైన తీరు.. ఒక తరానికి పీడకలగానే నిలిచిపోతుంది. భారత ప్రజాస్వామ్య చరిత్రలో అలాంటి అత్యంత విషాదకరమైన పీడకలలు ఎన్నో ఉన్నాయి. అశేష ప్రజానీకానికి ఆరాధ్య దైవాలుగా నిలిచిన ఆ నేతల చివరి ప్రయాణాలను తలచుకుంటే.. నేటికీ గుండె బరువెక్కక మానదు. ఈ జాబితాలో ప్రజల మనసులు గెలిచిన నాయకుల నుంచి అన్ని రంగాల ప్రముఖులూ ఉన్నారు. విమాన ప్రమాదాలు అనగానే తెలుగు వారికి ముందుగా కొన్ని పేర్లు గుర్తుకు వస్తాయి. వారిలో యలవర్తి నాయుడమ్మ ఒకరు. చిన్న రైతు కుటుంబంలో పుట్టిన నాయుడమ్మ అంతర్జాతీయ స్థాయి రసాయన శాస్త్రవేత్తగా ఎదిగారు. అప్పట్లో ప్రధానమంత్రిగా ఉన్న ఇందిరాగాంధీకి సలహాదారుగా పనిచేసిన ఆయన, ఐక్యరాజ్యసమితితోపాటు పలు అంతర్జాతీయ సంస్థలకు, విదేశీ సంస్థలకు కూడా సలహాదారుగా పనిచేశారు. కెనడాలోని ఐడిఆర్‌సి సమావేశానికి హాజరై 1985 జూన్ 23న తిరిగి వస్తున్న క్రమంలో ఆ ఎయిర్ ఇండియా పేలిపోవటంతో కన్నుమూశారు. ఈ వార్త వినగానే.. ఆయన భార్య డాక్టర్ పవన ఆత్మహత్య చేసుకుని మరణించటం మరో విషాదం. ఇలాంటి విషాద వార్తలు వినగానే తెలుగువారికి ఎపి మాజీ సిఎం రాజశేఖరరెడ్డి, నాటి లోక్‌సభ స్పీకర్ జిఎంసి బాలయోగి, సినీ నటి సౌందర్య మరణాలు గుర్తుకు రాకుండా ఉండవు.

లోక్‌సభ మాజీ స్పీకర్, టిడిపి నేత జిఎంసి బాలయోగి 2002 మార్చి 3న హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. భీమవరం నుంచి బయలుదేరిన ఆయన ప్రయాణిస్తున్న ప్రైవేట్ హెలికాప్టర్, కృష్ణా జిల్లా కైకలూరు సమీపంలోని ఓ చెరువులో కూలిపోయింది. సరిగ్గా రెండేళ్ల తర్వాత తెలుగువారికి ఎంతో సుపరిచితురాలైన ప్రముఖ సినీ నటి సౌందర్య 2004 ఏప్రిల్ 17న జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందారు. ఇక.. తెలుగు రాష్ట్రాల ప్రజల జనహృదయ నేతగా పేరు తెచ్చుకున్న నేత దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 14 వ సిఎంగా పనిచేసిన వైఎస్ఆర్.. 2009, సెప్టెంబర్ 2న నల్లమల అడవుల్లో హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. ఆయన మరణం తెలుగు రాష్ట్రాల ప్రజలను తీవ్రంగా కలచివేసింది. విమాన ప్రమాదంలో దేశం కోల్పోయిన మరో మేధావి హోమీ జహంగీర్ బాబా. 1966 జనవరి 24న జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదంలో ఈ ప్రపంచ ప్రఖ్యాత అణుశాస్త్రవేత్త అకాల మరణం చెందారు. 1980 జూన్ 23న మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ కుమారుడు సంజయ్ గాంధీ విమాన ప్రమాదంలో మృతి చెందారు. ఢిల్లీ ఫ్లయింగ్ క్లబ్‌కు చెందిన విమానాన్ని నడుపుతూ, ప్రమాదకర విన్యాసాలు చేయడానికి ప్రయత్నించగా, విమానం కూలిపోయింది.

కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్రమంత్రి మాధవరావు సింధియా 2001 సెప్టెంబర్ 30న విమాన ప్రమాదంలో మృతి చెందారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా, ఆయన ప్రయాణిస్తున్న విమానం ఉత్తరప్రదేశ్ మైన్‌పురి సమీపంలో కూలిపోయింది. అలాగే, ప్రముఖ పారిశ్రామికవేత్త, హర్యానా మంత్రి ఓంప్రకాశ్ జిందాల్ 2005 మార్చి 31న జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. 2011 ఏప్రిల్ 30న తవాంగ్, ఇటానగర్ మధ్య జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో అప్పటి అరుణాచల్‌ప్రదేశ్ సిఎం దోర్జి ఖండు దుర్మరణం చెందారు. భారతదేశ తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్ 2021 డిసెంబర్ 8న జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందారు. ఈ ప్రమాదంలో బిపిన్ రావత్ భార్యతోపాటు మరో 11మంది మరణించారు. నిరుడు జూన్ నెలలో దేశవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపిన అహ్మదాబాద్ ఎయిరిండియా ప్రమాదంలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ మరణించారు. ఇలా వరుసగా జరుగుతున్న విమాన, హెలికాప్టర్ ప్రమాదాలు చరిత్రలో చెరగని విషాద ఘట్టాలుగా నిలిచిపోయాయి.

తాజాగా, బుధవారం ఉదయం మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఆయన ప్రయాణిస్తున్న విమానం బారామతిలో ల్యాండింగ్ అవుతుండగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో అజిత్ పవార్‌తో పాటు మరో నలుగురు మృతి చెందారు. ఈ వార్త విని యావత్ దేశం దిగ్భ్రాంతికి గురైంది. ముంబై నుంచి తన సొంత నియోజకవర్గం బారామతిలో జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారానికి వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. విమానం బయల్దేరినప్పటి నుంచి రెండుసార్లు సిగ్నల్స్ కట్ అయినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ డేటాలో తేలింది. ఉదయం 8:10 గంటలకు ముంబై ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరిన విమానం, ప్రారంభంలో 6 కిలోమీటర్ల ఎత్తులో ప్రయాణించింది. 8:34 నిమిషాలకు మొదటిసారి సిగ్నల్స్ ఆగిపోయి, కొద్దిసేపటి తర్వాత మళ్లీ కనెక్ట్ అయ్యాయి. అయితే, 8:43 నిమిషాలకు బారామతి ఎయిర్‌పోర్ట్‌కు కేవలం 20 కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పుడు సిగ్నల్స్ పూర్తిగా నిలిచిపోయాయి.

ప్రమాదానికి కొన్ని నిమిషాల ముందు విమానం వేగం గంటకు 237 కిలోమీటర్లకు పడిపోయి, ఆకస్మికంగా సంబంధాలు తెగిపోవడంతో కూలిపోయినట్లు దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. విమాన ప్రమాదాలకు చాలా సార్లు పైలట్ తప్పిదం, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌లో నిర్లక్ష్యం కారణంగా కూలిపోయిన ఘటనలు గతంలో వెలుగుచూశాం. అంతేకాకుండా చాలాసార్లు విమానాలు నడిపే పైలట్లకు అనుభవం లేకపోవడం వల్ల.. వారు తీసుకునే తప్పుడు నిర్ణయాలతోనూ విమానాలు కూలిపోయే అవకాశాలుంటాయి. ఇక సాంకేతిక సిబ్బంది చేసిన తప్పుల కారణంగా సైతం విమానాలు కూలిపోతుంటాయి. పైలట్ కంట్రోల్ రూమ్ మధ్య కమ్యూనికేషన్ కోల్పోవడం కూడా విమాన ప్రమాదానికి దారితీస్తుంది. వాతావరణం కూడా విమాన ప్రమాదాలకు కారణం అవుతుంది. బలమైన తుఫానులు, మెరుపులు, భారీ వర్షం, వాతావరణంలో అల్లకల్లోలం కారణంగా, విమానం నియంత్రణ కోల్పోయి ప్రమాదం బారినపడే అవకాశాలుంటాయని నిపుణులు అంటున్నారు.



# నా చీరలపై ట్రోల్స్ తో ఏమి వస్తుంది

**జయభేరి, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2 :**

గత కొన్నేళ్ల నుంచి కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో శాఖలకు కేటాయింపులతో పాటు, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ధరించే చీరలపై చర్చ జరుగుతుంటుంది. దేశ సంస్కృతీ సంప్రదాయాల్ని ప్రతిబింబించేలా పలు రాష్ట్రాలకు చెందిన చేనేత ఉత్పత్తులను ఆమె బడ్జెట్ రోజు ప్రమోట్ చేసి వారికి మద్దతుగా నిలుస్తుంటారని తెలిసిందే అయితే, ఈసారి తన చీరలపై ప్రతిపక్షాలు, సోషల్ మీడియాలో చర్చపై ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం నిర్మలా సీతారామన్ మీడియాతో మాట్లాడారు. అయితే బడ్జెట్ రోజున తాను ఏం ధరించబోతున్నాననే ప్రశ్నలు తనపై ఆర్థికశాఖ అంశాలు కాకుండా అనవసరమైన ఒత్తిడిని పెంచుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలు బడ్జెట్‌లోని ముఖ్యాంశాలను తెలుసుకోవడంపై దృష్టి పెడతారు కానీ, నేను ఏ రంగు చీర కట్టుకున్నాను, ఎందుకు ధరించాననే విషయంపై చర్చలు అనవసరం అని ఆమె కుండబద్దలు కొట్టారు. బడ్జెట్ రోజు చీరపై మీడియా అడిగిన ప్రశ్నకు ఆమె ఇలా ఘాటుగా స్పందించారు. ఒక మహిళా మంత్రిగా తన వస్త్రధారణపై జరుగుతున్న అతిగా స్పందించడంపై సీతారామన్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ బడ్జెట్ ప్రవేశపెట్టేది పురుషులు అయితే, వారిని సైతం ఇలాగే వారి దుస్తుల గురించి కూడా ప్రశ్నలు అడిగేవారా అని ఆమె ప్రశ్నించారు. మహిళా మంత్రిని కనుకే తాను ధరించే చీరలపై చర్చ జరుగుతోందని, పురుషులు అయితే వారి డ్రెస్సింగ్ గురించి చర్చ జరిగేది కాదన్నారు. తాను ధరించే చీరను సైతం బడ్జెట్ రోజు ఒక అంశంలా మార్చేయడం సరికాదని, దీనివల్ల ఎవరికి ప్రయోజనం ఉండదన్నారు. దేశ సంస్కృతిని ప్రతిబింబించేలా తాను దుస్తులు ధరిస్తానని, అది సహజమైన ప్రక్రియే కానీ దాన్ని ఎవరూ విశ్లేషించాల్సిన అవసరం లేదన్నారు.

**కాంచీపురం చీర ప్రత్యేకత ఏమిటి?**

నిర్మలా సీతారామన్ వరుసగా 9వసారి కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తొలి ఆర్థికమంత్రిగా ఘనత సాధించారు. కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజు నిర్మలా సీతారామన్ తమిళనాడు రాష్ట్రానికి చెందిన సాంప్రదాయ కాంచీపురం పట్టు చీరను ధరించారు. కాంచీపురం చీరలు వాటి బలం, భారీ ఆకృతి, స్వచ్ఛమైన పట్టుకు ప్రసిద్ధి చెందాయి. అవి తమిళనాడులోని కాంచీపురం ప్రాంతంలో చేతితో నేస్తారు. ఈ చీరలను స్వచ్ఛమైన మల్బరీ పట్టు, బంగారం, వెండి జరీని ఉపయోగించి తయారుచేస్తారు. ఈ చీరల తయారీకి కొన్నిసార్లు 2 వారాల వరకు పడుతుంది. ఈ చీరను, అంచును విడివిడిగా నేస్తారు. అయితే పల్లును పెట్ని పద్ధతి ద్వారా కలుపుతారు. ఫిబ్రవరి) బడ్జెట్ ప్రసంగం సమయంలో నిర్మలా సీతారామన్ మెజెంటా రంగు కాంచీపురం చీరలో కనిపించారు. బంగారు, కాఫీ రంగు అంచు ఉన్న ఈ చీర తమిళనాడు సంప్రదాయానికి ప్రతీకగా ఉంది. త్వరలో తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న కారణంగా ఆమె కావాలనే ఆ రాష్ట్రానికి సంబంధించిన చీరను బడ్జెట్ రోజు ఎంచుకున్నారంటూ విపక్షాలతో పాటు కొందరు నెటిజన్లు రకరకాల విశ్లేషణలు మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే మంత్రి నిర్మలా సీతారామన్ అసహనం వ్యక్తం చేశారు. బడ్జెట్ రోజు శాఖలకు కేటాయింపులు, దేశ ఆర్థిక పరిస్థితి, భవిష్యత్ ప్రయోజనాలపై చర్చించాల్సిన సమయంలో దుస్తుల గురించి మాట్లాడటం అనవసరమని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# సజ్జనార్ పై హరీష్ ఫైర్



**జయభేరి, హైదరాబాద్, ఫిబ్రవరి 2 :**

ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు చేస్తున్న సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) చీఫ్ వీసీ సజ్జనార్ తీరుపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. న్యాయస్థానం తుది తీర్పు ఇవ్వకముందే ఫోన్ ట్యాపింగ్‌ను "అక్రమం" అని అధికారికంగా ఎలా ప్రకటిస్తారని ఆయన ప్రశ్నించారు. సిట్ చీఫ్ హోదాలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం చట్టబద్ధంగా నిలవదని, ఇది తీవ్ర ఆందోళన కలిగించే విషయమని అన్నారు. ఈ అంశంపై హరీశ్ రావు మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యంలో, ఒక ఆరోపణ నేరమని తేల్చాల్సింది న్యాయస్థానం మాత్రమేనని స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం, నిందితుడు నిరపరాధి అనే భావన ప్రాథమిక సూత్రమని, దీనిని విస్మరించరాదని అన్నారు. దర్యాప్తు చేయడం మాత్రమే పోలీసుల విధి అని, విచారణ దశలోనే ఒక చర్యను చట్టవిరుద్ధమని ప్రకటించడానికి వారేమీ న్యాయమూర్తులు కాదని హరీశ్ రావు అభిప్రాయపడ్డారు. ఒక ఫోన్ సంభాషణను రహస్యంగా వినడం చట్టబద్ధమా, కాదా అనేది ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్ సెక్షన్ 5(2), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని నిబంధనలకు లోబడి ఉంటుందని వివరించారు. అలాగే, పీయూసీఎల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా జరిగిందా లేదా అన్నది న్యాయ సమీక్ష ద్వారానే తేలుతుందని, పోలీసుల అధికారిక సందేశాల ద్వారా కాదని అన్నారు. "అక్రమ ఫోన్ ట్యాపింగ్" అనే పదాన్ని అధికారికంగా ఉపయోగించడం ద్వారా, సిట్ చీఫ్ దర్యాప్తు ఫలితంపై ముందుగానే ఒక నిర్ణయానికి వచ్చినట్లు స్పష్టమవుతోందని హరీశ్ రావు ఆరోపించారు. ఆయన ప్రవర్తన తను నిర్వహిస్తున్న పదవికి తగనిదని, సీనియర్ అధికారులు పాటించాల్సిన నిష్పాక్షికత, సమగ్రతకు సంబంధించిన అఖిల భారత సర్వీసుల (ప్రవర్తనా) నిబంధనలు, 1968కు ఇది పూర్తిగా విరుద్ధమని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ప్రతిపక్ష నేతకు సంబంధించిన అత్యంత రాజకీయ ప్రాధాన్యమున్న కేసులో ఇలాంటి తొందరపాటు నిర్ధారణలు చేయడం వల్ల దర్యాప్తు రాజకీయ ప్రేరేపితంగా, పక్షపాతంతో సాగుతోందనే అనుమానాలకు తావిస్తోందని అన్నారు. దర్యాప్తు నిష్పక్షపాతంగా జరగడమే కాదు, అలా జరిగినట్లు ప్రజలకు కనిపించాలని సుప్రీంకోర్టు పలుమార్లు చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయడానికి లేదా రాజకీయ కథనాలను ముందుకు తీసుకెళ్లడానికి పోలీసుల అధికారిక ప్రకటనలను వాడుకోరాదని హరీశ్ రావు హితవు పలికారు. దర్యాప్తు సంస్థలు చట్టపరిధిలో స్వతంత్రంగా పనిచేయాలని డిమాండ్ చేశారు. తీర్పులు ఇవ్వాల్సింది కోర్టులే తప్ప పోలీసుల సందేశాలు కాదని, రాజ్యాంగ పరిమితులను సంస్థలు అతిక్రమిస్తే ప్రజాస్వామ్యం మనలేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా, "కేసీఆర్ ని ప్రతిపక్ష నేతగా సిట్ చీఫ్ ఎందుకు గుర్తించడం లేదో తెలంగాణ ప్రజలు తెలుసుకోవాలనుకుంటున్నారు" అని హరీశ్ రావు సూటిగా ప్రశ్నించారు. కేసీఆర్ విచారణ అనంతరం సిట్ చీఫ్ సజ్జనార్ చేసిన ట్వీట్ కు ప్రతిస్పందనగా హరీశ్ రావు ఈ మేరకు ట్వీట్ చేశారు.

# లక్ష్మీ నరసింహ స్వామికి చక్రతీర్థ మహోత్సవం

జయభేరి, యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 02 :

యాదగిరి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయం పాతగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. సోమవారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం శాస్త్రక్తంగా పూర్ణాహుతి, చక్ర తీర్థం మహోత్సవం, సాయంత్రం పుష్పయాగం, డోలారోహణము పూజలను గావించారు.

**పూర్ణాహుతి :** శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో దేవకోటిని ఆహ్వానిస్తూ మంత్రములతో లోక క్షేమం కోసం జరిగే పూజ పూర్ణాహంతి అని తెలిపారు.

**చక్రతీర్థం :** కళ్యాణ దంపతులుగా ఊరేగిన శ్రీ లక్ష్మీ నరసింహుడికి చక్రతీర్థ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా ఆలయ అర్చకులు నిర్వహించారు. శ్రీ స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి మేళ తాళాలతో వేదమంత్రాలతో ఊరేగించి నవవసంతాని స్వాగతిస్తూ స్వామి వారు పుష్కరిణి స్నానం చక్కర తీర్థ మహా ఘట్టాన్ని నిర్వహించారు. స్వామి వారి పుష్కరిణి స్థానంలో భక్తులు కూడా పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

**పుష్పయాగం.. డోలారోహణ...**

పాతగుట్ట బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం నిత్య పూజలు గావించిన అర్చకులు శాస్త్రోక్తంగా పుష్పయాగం, దోలారోహణ మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. భగవంతునికి ప్రీతికరమైన పుష్పాలతో స్వామివారిని పూజించి ఆయన కృప పొందడమే పుష్పయాగము అర్చకులు తెలిపారు. కళ్యాణ దంపతులైన శ్రీ లక్ష్మీ నరసింహుని ఏకాంత సేవగా డోలారోహణ అర్చకులు వైభవంగా నిర్వహించారు. యాదాద్రి ఆలయ ప్రధాన అర్చకులు కాండూరి వెంకటాచార్యులు,అర్చకుల బృందం,వేద పండితులు ఉత్సవాన్ని నిర్వహించగా, ఈ వేడుకలలో యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవాని శంకర్, అను వంశిక ధర్మకర్త నరసింహమూర్తి, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.




# అక్రమ నిర్మాణాలకు అధికారుల అండ దండలు

- అనుమతులకు మించి అదనపు అంతస్తులజోరు
- ఒక్కో ఫ్లోర్కు ఒక్కో రేటు
- రెసిడెన్షియల్, కమర్షియల్
- అదనపు అంతస్తులు వేర్వేరు స్లాబ్ రేట్లు
- విజిలెన్స్ వున్నా ఆగని అక్రమ నిర్మాణాల షెడ్లు
- నూతన జెడ్సీ నైనా చర్యలు తీసుకునేనా?

జయభేరి, కుత్బుల్లాపూర్ :



దుండిగల్ సర్కిల్ 59లో నిబంధనలకు విరుద్ధంగా అదనపు అంతస్థుల రాజ్యమేలుతోంది.. అనుమతులు ఒకలా నిర్మాణాలు మరోలా ఉంటున్నాయి. కాలనీల్లో ఒకలా ప్రధాన రహదారుల్లో రెసిడెన్షియల్ అనుమతులు తీసుకుని నిబంధనలను పూర్తిగా అతిక్రమించి వాణిజ్య నిర్మాణాలు చేస్తున్నారు. మమ్మల్ని చూసుకో. అదనపు ఫ్లోర్లు నిర్మించుకో వాస్తవానికి కిందిస్థాయి సిబ్బంది తప్పు చేస్తే ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారు. కానీ దుండిగల్ సర్కిల్ లో మాత్రం ఇందుకు విరుద్ధంగా పాలన సాగుతుంది. ప్రత్యేక సిబ్బందిని నియమించి అక్రమ నిర్మాణాల వద్ద వసూళ్లు చేపట్టే కార్యక్రమాలకు ఇక్కడ శ్రీకారం చుట్టారు. ఫిర్యాదులు వస్తే చర్యలు చేపట్టాల్సింది పోయి సార్ పంపాడు, మేడమ్ పంపారు అంటూ.. ఒక్కో అంతస్థుకు ఒక్కో రేటు నిర్ణయించి వసూళ్లు చేస్తున్నారు. ఇక ఈ అక్రమ వసూళ్ల లో సైతం రెసిడెన్షియల్, కమర్షియల్, సెల్లార్లకు వేర్వేరు రేట్లు నిర్ణయించి బరితెగించి వసూళ్లకు పాల్పడుతున్నారు. దుండిగల్ గండ్డిమైసమ్మ నుండి బాచుపల్లి రోడ్ లో ఒకటి, గండ్డిమైసమ్మ నుండి నర్సాపూర్ హైవేకు సెల్లార్, షెడ్ లు నిర్మితమవుతున్న అక్రమ నిర్మాణంపై చర్యలు శూన్యం.



**అక్రమాలకు అడ్డుకట్ట లో విఫలం దండు-కోవడంలో సఫలం**

దుండిగల్ సర్కిల్ లో కాలంనీల క్రమంగాఅక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. కార్పొరేషన్ పాలన, ప్రత్యేక అధికారి పాలన ముగిసి సర్కిల్ ఏర్పడినప్పటికీ అక్రమ నిర్మాణాల జోరు తగ్గడం లేదు. అక్రమ నిర్మాణాలను అరికట్టడంలో టౌన్ ప్లానింగ్ విభాగం పూర్తిగా ఫెయిల్ అయ్యింది. కిందిస్థాయి చేసే అక్రమాలను కట్టడి చేయాల్సిన కమిషనర్, టీపీఎస్లు ప్రత్యేక సిబ్బందిని పెట్టి మరీ వసూళ్లు చేస్తున్నారు. విజిలెన్స్ శాఖ నిగా పెట్టినా కూడా వసూళ్ళకు చెక్ పడటంలేదు. దుండిగల్ సర్కిల్ కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ ప్రత్యేక దృష్టిసారించి అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపడంతో పాటు అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని సర్వత్రా డిమాండ్ చేస్తున్నారు.

**అక్రమ నిర్మాణం జోనల్ కమిషనర్ చర్యలు తీకునేనా?**

దుండిగల్ సర్కిల్లో ఆయా వార్డుల్లోని ర్మితమవుతున్న అక్రమ నిర్మాణాలను సంబంధించి సర్కిల్ సీపీతో ప్రత్యేక విచారణ జరిపించి మొత్తం ఎన్ని అక్రమ నిర్మాణాలుజరుగుతున్నాయి, వాటి అనుమతులు, విరుద్ధంగా నిర్మితమవుతున్న కమర్షియల్ భవనాలు, ఆయా భవనాల వద్ద సిబ్బంది చేసిన వసూళ్లు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఇందుకు జోనల్ కమిషనర్క్షేత్రస్థాయిలో సర్కిల్లో పర్యటించి ఇక్కడజరుగుతున్న అవినీతికి చెకపెట్టాలని ఇక్కడి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**చెర్యలు ఉండవు:-**

దుండిగల్ సర్కిల్ పరిధిలో ఆయావార్డుల్లో నిర్మితమవుతున్న అక్రమ నిర్మాణాల్లో టౌన్ ప్లానింగ్ విభాగం.కిందిస్థాయి సిబ్బంది పాత్ర ఉంది. వీరిని పై అధికారులు దగ్గరుండి ప్రోత్సహిస్తున్నట్లు విపరీతమైన ఆరోపణలు ఉన్నాయి.. అక్రమ నిర్మాణాలనుచూసిచూడనట్లు పోవాలని ఫిర్యాదు దారులుఫిర్యాదు చేసినా దాటవేసే ధోరణి ప్రదర్శించి కాల యాపన చేయాలనే ఆదేశాలు కిందిస్థాయి సిబ్బందికి ఉన్నట్లు ఆరోపణలు కోడైకూస్తున్నా..

**విజిలెన్స్ నిగా పెట్టినా:-**

ఇటీవల దుండిగల్ సర్కిల్ పై విజిలెన్స్ జరుగుతున్న అవినీతిపై దృష్టిసారించింది. ప్లానింగ్నిర్మాణాలకుసంబంధించి పలు ఫైల్స్ స్వాధీనంచేసుకున్నట్లు తెలుస్తోంది.. పక్కాగా ఈశాఖలో బరితెగించి అవినీతి జరుగుతున్నా,అవినీతిని అరికట్టడంలో విజిలెన్స్ సైతం ఫలితం సాధించలేకపోతుంది. అడ్డగోలుగాజరుగుతున్న దోపిడిపై ఏసీబీ నజర్ పెడితేనేఇక్కడి అవినీతికి చెక్ పడుతుందని సర్వత్రా అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

# గడపగడపకూ ప్రభుత్వ విప్

- యాదగిరిగుట్టపట్టణ అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే హామీ

జయభేరి, యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 03 :



మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో యాదగిరిగుట్ట పట్టణంలోని రాజకీయ వేడి పెరిగింది.కాంగ్రెస్ అభ్యర్థుల విజ యమే లక్ష్యంగా ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. సోమవారం యాదగిరిగుట్ట పట్టణంలోని 9వ వార్డ్, 10వ వార్డుల్లో ఆయన విస్తృతంగా పర్యటించి, ఓటర్లను అభ్యర్థించారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా ఆలేరు ఎమ్మెల్యే అయిలయ్య ప్రతి ఇంటింటికీ వెళ్లి ఓటర్లతో ముఖాముఖి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలోని అమలవుతున్న ప్రజాపాలన ద్వారా ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలోని వైఫల్యాలను ఎండగట్టిన ఆయన,కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీల అమలు తీరును ప్రజలకు వివరించారు. అభివృద్ధికి పట్టాభిషేకం చేయండి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపిస్తే, యాదగిరిగుట్ట పట్టణ రూపురేఖలను మారుస్తాం.

మౌలిక సదు పాయాల కల్పన, మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరాకు మా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుంది అని ఆలేరు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. స్థానిక అభ్యర్థులకు ప్రజల నుంచి లభిస్తున్న స్పందన చూస్తుంటే విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మహిళలు, వృద్ధులతో నేరుగా మాట్లాడుతూ.. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రచారంలో భారీ సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు, స్థానిక నాయకులు పాల్గొని ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ వంటి అంశాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్టిఏ మెంబర్ ఆకుల నర్సింహ, ఆలేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఐన్యాల చైతన్య రెడ్డి, మున్సిపల్ తొమ్మిది వార్డు కాంగ్రెస్ అభ్యర్థి సాధునేని ధనలక్ష్మిమధుకర్, పదవ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నేతలు బందారపు బిక్షపతి, చీర శ్రీశైలం, డాక్టర్.గిరిధర్, కైరంకొండ వినోద్, బాల్ నర్సయ్య, నవీన్, నాగరాజు, పాండురాజు, శ్రీను, కాటంరాజు, జీవన్ రెడ్డి, అరుణ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

## రేవంత్ గుణం మాత్రం మారలేదు

హేట్ స్పీచ్పై ఉపన్యాసం ముగియకముందే, రేవంత్ రెడ్డి హేట్ స్పీచ్కు లైవ్ డెమో ఇచ్చారు. కేసీఆర్ పై కడుపులో కత్తులు, నోటిలో విషం పెట్టుకున్న రేవంత్ రెడ్డి తన అజీర్తిని, అక్కసును మరోసారి బయటపెట్టారు. హేట్ స్పీచ్ అంటే ఏమిటో చెప్పడానికి పుస్తకాలు అవసరం లేదు.. రేవంత్ రెడ్డి ప్రసంగాలు చాలని అన్నారు. అమెరికా వెళ్లి హార్వర్డ్ లో నాలుగు రోజులు చదువుకున్నా.. రేవంత్ రెడ్డి తన వెనకటి గుణం మాత్రం మార్చుకోలేదు. కనీస సంస్కారం రాలేదు, చిల్లర మాటల్లో, వెకిలి చేతల్లో ఎలాంటి మార్పు రాలేదు. ద్వేష రాజకీయాలకు, నరం లేని నాలుకతో విషం చిమ్మే కుసంస్కారానికి నిలువెత్తు నిదర్శనం రేవంత్ రెడ్డి. దేశానికి గాంధీ గారు జాతిపిత అయినట్లే, తెలంగాణను సాధించిన కేసీఆర్ జాతి పితనే రేవంత్ రెడ్డి. నాలుగు కోట్ల ప్రజలు ఏకమై స్వరాష్ట్రం కోసం కొట్లాడుతుంటే ఆంధ్రా పాలకుల బూట్లు తుడుస్తున్న నీకు కేసీఆర్ గురించి, తెలంగాణ ఉద్యమం గురించి ఎలా తెలుస్తుంది? ఉద్యమకారులపైకి తుపాకి ఎక్కుపెట్టిన నీకు ఉద్యమకారుల గురించి మాట్లాడే హక్కు ఉందా రేవంత్ రెడ్డి? ప్రశ్నిస్తే, నిలదీస్తే అరెస్టులు, కేసులతో నిరంకుశంగా వ్యవహరిస్తున్న నీకు ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడే హక్కు ఉందా రేవంత్ రెడ్డని అన్నారు. అధికారాన్ని ప్రజల బాగు కోసం కాకుండా, ప్రతిపక్షాలపై రాజకీయ కక్షల కోసం వినియోగిస్తున్న నీకు అధికార దుర్వినియోగం గురించి మాట్లాడే హక్కు ఉందా రేవంత్ రెడ్డి? లక్కీ లాటరీలో ముఖ్యమంత్రి అయిన నీకు ఇవన్నీ ఎలా తెలుస్తాయి? ఎలా అర్థం అవుతాయి రేవంత్ రెడ్డి? నువ్వు అమెరికా లోని హార్వర్డ్ వెళ్ళినా, అంతరిక్షం వెళ్ళినా నీ చెత్త బుద్ధి మారదు, నోటి మురికి పోదు అన్నది సుస్పష్టమని అన్నారు.

## టెట్ మినహాయింపు పై ఫిబ్రవరి 5న చలో ఢిల్లీ

- టీఎస్ యుటిఎఫ్ దేవరకద్ర మండలం అధ్యక్షుడు శంకర్,ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య



జయభేరి, దేవరకద్ర :

సీనియర్ ఉపాధ్యా యులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష నుండి మినహాయింపు ఇవ్వాలని ఫిబ్రవరి 5న చలో ఢిల్లీ కార్యక్రమం చేపడుతున్నట్లు టీఎస్ యుటిఎఫ్ దేవరకద్ర మండల అధ్యక్షుడు కే. శంకర్ మరియు ప్రధాన కార్యదర్శి డి కృష్ణయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధించాలని, జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని,పాఠశాలల మూసివేత, విలీనం నిలిపి వేయాలని, ఎస్ జి టి ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఓటు హక్కును కల్పించాలని ,ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని, కాంట్రాక్టు, తాత్కాలిక ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని తదితర డిమాండ్లతో జాతీయ ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యా చరణ సమితి పిలుపు మేరకు ఫిబ్రవరి 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కావున ఈ కార్యక్రమానికి దేవరకద్ర మండలంలోని ఉపాధ్యాయులు తరలిరావాలని వారు కోరారు.



## బీఆర్ఎస్ అభ్యర్థులకు బీ ఫారాలు

- మాజీ డిసిసిబీ ఛైర్మన్ గొంగిడి

జయభేరి, యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 03:

యాదగిరిగుట్ట మున్సిపాలిటీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు మాజీ డిసిసిబీ ఛైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి సోమవారం బీఫామ్లను అందజేశారు. 1వ వార్డు మిట్ట నర్సింగ్, 2వ వార్డు పాపట్ల నరహరి, 3వ వార్డు కోల కావేరివెంకటేష్ గౌడ్, 4వ వార్డు రాచకొండ జ్యోతిశ్రీనివాస్, 5వ వార్డు మానుపాటి పరుశరాములు, 7వ వార్డు ఆరే జయమ్మశ్రీధర్ గౌడ్, 8వ వార్డు పేరబోయిన సత్యనారాయణ యాదవ్, 9వ వార్డు దండబోయిన మమత అనిల్, 10వ వార్డు ఆవుల మమత సాయి, 11వ వార్డు సయ్యద్ బాబా, 12వ వార్డు కంసాని కీర్తి స్వామిలు పోటీలో ఉన్నారు.

## శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణం.. మల్లన్న స్వామి కల్యాణోత్సవ

- ప్రత్యేక పూజాకార్యక్రమంలో పాల్గొన్న నర్సారెడ్డి భూపతి రెడ్డి



జయభేరి, కుత్బుల్లాపూర్:-

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం బౌరంపేట్ డివిజన్ లోని మల్లన్న స్వామి దేవాలయంలో అంగరంగ వైభవంగా జరుపుకునే కళ్యాణోత్సవంలో ఆలయ కమిటీ ప్రత్యేక ఆహ్వానం మేరకు పూజా కార్యక్రమంలో పాల్గొని రేణుక ఎల్లమ్మ మరియు మల్లన్న స్వామి ఆశీస్సులు పొందిన మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సారెడ్డి భూపతి రెడ్డి. ఈ సందర్భంగా భూపతి రెడ్డి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా బౌరంపేట్ గ్రామంలో ప్రజలుభక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ కళ్యాణోత్సవానికి ఎంతో ప్రసిద్ధి ఉందని చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు తమ మొక్కలను చెల్లించుకొని నియమనిష్టలతో దేవుని దర్శించుకుంటారని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలురాజకీయాలకతీతంగా ఈ జాతరను ముందుకు నడుపుతూ వస్తున్నారని జాతరకు 20వేలకు పైగా భక్తులు పాల్గొంటారని, భక్తులకు అమ్మవారి కృప కటాక్షాలు, ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలుచేకూర్చాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు పద్మా రెడ్డి, కుత్బుల్లాపూర్ యువ నాయకులు నర్సారెడ్డి తేజ రెడ్డి (NTR), బౌరంపేట్ మాజీ సర్పంచ్ మిద్దిల యాదిరెడ్డి, సీనియర్ నాయకులు విజయ్ గౌడ్, పోచి మహేష్, సురేష్, మల్లేష్ యాదవ్, విజయ్ కుమార్, భరత్ గౌడ్, అరుణ్ రెడ్డి మరియు ఆలయ కమిటీ సభ్యులు, బౌరంపేట్ గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## టి పి యు ఎస్ జిల్లా కార్యదర్శిగా నేలంటి వెంకటేశ్వర్లు



జయభేరి, దేవరకొండ :

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నల్గొండ జిల్లా టిపియూఎస్ జిల్లా కార్యదర్శిగా నేల0టి వెంకటేశ్వర్లను ఎన్నుకున్నట్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కట్టబోయిన శ్రీనివాస్ యాదవ్ సోమవారం తెలిపారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం లో స్కూల్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు చురుకుగా పని చేస్తాడని ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడడంలో ముందుంటాడని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన టిపియూఎస్ జిల్లా కార్యదర్శి నేలంటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సభ్యులలో ఎవరికి ఇబ్బంది ఉన్నా ముందుంటానన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్ది ప్రయోజకులుగా చేసినప్పుడే మనకు గౌరవం దక్కుతుందన్నారు.ఈ సందర్భంగా నేలంటి వెంకటేశ్వర్లు ను పలువురు అభినందించారు. నమ్మకంతో తనను ఎన్నుకున్నందుకు ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలియజేశారు.

## హరి వర్ధన్ గౌడ్ అంతర్జాతీయ కరాటేలో స్వర్ణ పతకాలు కైవసం



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ 18 వ వార్డు మాజీ కౌన్సిలర్ వీరముని అంజి గౌడ్ తనయుడు వీ. హరి వర్ధన్ గౌడ్ విశాఖపట్నంలో నిర్వహించిన 9వ అంతర్జాతీయ కరాటే ఛాంపియన్షిప్ లో పాల్గొని, కాటా, కుమిటే విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించారు. SSK మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇండియా తరఫున పాల్గొన్నారు. కోచ్ కె. సాయి కిరణ్ అభినందనలు తెలియజేసినారు.



## మానవత్వాన్ని చాటుకున్న సుధాకర్

జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 02 :

తుర్కపల్లి మండలం బద్దు తండాకు చెందిన మాడోత్ సుధాకర్ నాయక్ ఆదివారం తుర్కపల్లి మండలం నుండి పని నిమిత్తం కారులో వరంగల్ కు వెళ్తున్న క్రమంలో జనగాం జిల్లా స్టేషన్ ఘనపూర్ కు చెందిన సముద్రాల వెంకటయ్య కుటుంబ సభ్యులకు లిఫ్ట్ ఇచ్చినట్టు తెలిపారు. వారు దిగిపోయే సమయంలో తమ బ్యాగులో ఉన్న 5కులాల బంగారు ఆభరణాలు, 70తులాల వెండి కారులోనే మర్చిపోయి వెళ్లారు. అది తెలుసుకున్న సుధాకర్ నాయక్ స్టేషన్ ఘనపూర్ కి వెళ్లి వారికి అందజేసి మానవత్వాన్ని చాటుకున్నాడు. ఈ సందర్భంగా బంగారం పోగొట్టుకున్న బాధిత కుటుంబ సభ్యులు అభినందించి కృతజ్ఞతలు తెలియజేశారు. సుధాకర్ నాయక్ ను తుర్కపల్లి మండల కేంద్రంలో సోమవారం సుశ్రుత గ్రామీణ వైద్యులు సంఘ జిల్లా అధ్యక్షుడు లయన్ అంబటి చెన్న కిష్టయ్య ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తరుణి శ్రీహరి, చాగంటి మహేష్, మెరుగు అశోక్, కొత్త ప్రణీత్ రెడ్డి, బేతాళ హరిబాబు, పెండెం బాలరాజు, రాళ్ల బండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయిని అమ్మిన, పండించిన చట్ట రీత్య చర్యలు



జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 02 :

గంజాయిని సేవించిన, అమ్మిన, పండించిన చట్టరీత్య చర్యలు తీసుకుంటామని ఎస్సై తక్యుద్దీన్ అన్నారు. సోమవారం తుర్కపల్లి మండల కేంద్రంలో ఇద్దరు వ్యక్తులు ఫోర్డ్ కారులో అక్రమంగా గంజాయి తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో కలిసి గ్రామ శివారులోని సబ్ స్టేషన్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏపీ 29 ఎన్ 5878 నెంబర్ గల కారును తనిఖీ చేయగా అందులో 200 గ్రాముల గంజాయి లభించిందని సదర్ గంజాయిని బీబీనగర్ మండలం కొండమడుగు వద్ద కొనుగోలు చేసి తుర్కపల్లి వైపు వెళ్తుండగా పట్టుకున్నట్లు తెలియజేశారు. నిందితులు చామల అఖిల్ రెడ్డి, మజోజు ప్రశాంత్ లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు వారి వద్ద నుండి 200 గ్రాముల గంజాయి, ఒక ఫోర్డ్ పిస్తా కారు, రెండు మొబైల్ ఫోన్లు, ఒక బరువు కొలిచే యంత్రము, ఒక బ్యాగు, కొన్ని కవర్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. జిల్లా ఎస్పీ అక్షాన్స్ యాదవ్, డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు, రూరల్ సీఐ మాదాసు శంకర్ ల పర్యవేక్షణలో ఎస్సై తక్యుద్దీన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు స్నాక్స్ అందజేత



జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 02 :

తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం రెండు పూటల స్నాక్స్ ను జిల్లా కోఆర్డినేటర్ కమ్యూనిటీ మొబిలైజేషన్ పెసరు లింగారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు సత్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ధన్యవాదాలు తెలియజేశారు.

## రెండవ వార్డ్ లో మున్సిపల్ ఎన్నికల ప్రచారం



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ రెండవ వార్డు మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా మాజీ శాసన సభ్యులు ఎన్నికల ప్రచారం నిర్వహించినారు. రవీంద్ర కుమార్ మాట్లాడుతూ.. గత పదేండ్లలో కెసిఆర్ చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని చూసే ప్రజలంతా మళ్ళీ కేసీఆర్ పాలన కోరుకుంటున్నారు అని ఆయన అన్నారు. రెండేళ్లలో పైసా పని చెయ్యని దద్దమ్మ రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి మున్సిపల్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలి అని ఆయన అన్నారు. బిఆర్ఎస్ హయంలో కేసీఆర్ నాయకత్వంలోనే దేవరకొండ అభివృద్ధి జరిగింది అని ఆయన తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వంలో నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 100కోట్లతో మున్సిపాలిటీలో అనేక పనులు చేపట్టాం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్, నేనావత్ కిషన్ నాయక్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు TVN రెడ్డి, 2వ వార్డు అభ్యర్థి పొట్ట మురళి, బొడ్డుపల్లి కృష్ణ, రమావత్ తులిసీరామ్, వడత్య బాలు, శ్రీను, నేనావత్ నాగార్జున, పెద్దయ్య, అందుగుల సైదులు, కొమ్ము ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా మన్యం కొండ రథోత్సవం

- నిండు పౌర్ణమి వెన్నెల్లో రథోత్సవం
- భక్తిపారవశ్యంతో పులకించిన మన్యంకొండలు
- గరుడ వాహనంపై తేరు మైదానానికి చేరుకున్న స్వామివారు
- స్వామివారికి జిల్లా ఎస్పీ పూజలు

జయభేరి, దేవరకద్ర :



మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రధాన దేవాలయమైన మన్యంకొండ శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి రథోత్సవం సోమవారం తెల్లవారుజామున అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతి ఏడాది స్వామివారి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఉత్సవాలలోని ప్రధాన ఘట్టమైన స్వామివారి రథోత్సవాన్ని సాంప్రదాయ రీతిలో అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగానే ఈ ఏడాది స్వామివారి ఉత్సవాలలో భాగంగా వెంకటేశ్వర స్వామి రథోత్సవాన్ని కనుల పండుగగా నిర్వహించారు. నిండు పౌర్ణమి వెన్నెల్లో స్వామివారి రథోత్సవం నయానా నందకరం గా జరిగింది. ఈ రథోత్సవానికి జిల్లా నుండే కాక ఇతర రాష్ట్రాల నుండి కొన్ని వేలమంది భక్తులు హాజరయ్యారు. రథోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజల కార్యక్రమాల అనంతరం గర్భగుడి నుండి స్వామివారిని ఊరేగింపుగా గరుడ వాహనంపై తేరు మైదానానికి తీసుకువచ్చారు. పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వాయిద్యాలు, కాగడాల వెలుతురు, భక్తుల హరినామశ్చరణల మధ్య ఈ ఊరేగింపు ముందుకు కదిలింది. ఈ సందర్భంగా తేరు మైదానంలో స్వామివారిని శోభాయమానంగా అలంకరించిన రథంపై ఉంచి దేవస్థానం చైర్మన్, అళహరి వంశీయులైన అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసు రాజుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథం ముందు కుంభం పోసిన తర్వాత సాంప్రదాయ రీతిలో స్వామివారి రథోత్సవానికి శ్రీకారం చుట్టారు. ఈ రథోత్సవంలో స్వామివారి రథోత్సవాన్ని లాగడానికి భక్తులు పోటీపడ్డారు. ఈ సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసిన రథంపై స్వామివారు అలంకరణలో ఊరేగుతూ భక్తకోటికి దర్శనం ఇచ్చారు. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు స్వామివారి రథోత్సవాన్ని తిలకించి తన్మయం చెందారు. భక్తి పారవశ్యంతో పులకించిపోయారు. రథోత్సవ అనంతరం స్వామి వారిని మళ్లీ గరుడ వాహనంపై తేరు మైదానం నుండి దేవస్థానం గుట్టపైన ఉన్న గర్భగుడిలోకి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా స్వామివారిని రకరకాల పూలు, వివిధ రకాల బంగారు ఆభరణాలతో ముస్తాబు చేశారు. దీంతో స్వామివారు అలంకరణలో ధగధగా మెరిసిపోతూ దర్శనానికి వచ్చిన భక్తులకు గర్భగుడిలో దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు స్వామివారికి ప్రీతిపాత్రమైన దాసంగాలను సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం కోనేరులో పుణ్య స్థానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. తల నీలాలు ఇచ్చి కూడా కొంతమంది భక్తులు తమ మొక్కలు చెల్లించుకున్నారు. రథోత్సవం సందర్భంగా కొన్ని వేల మంది భక్తులు మన్యం కొండకు తరలి రావడంతో భక్త జన సందోహంతో స్వామివారి దేవస్థానం ప్రాంతం మారుమోగిపోయింది. దీంతో మన్యం కొండలు భక్తులతో పులకించిపోయాయి. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణ, ప్రధాన పూజారులు రాజేష్ నరసింహయ్య, ఈఓ శ్రీనివాస రాజు, పాలకమండల సభ్యులు, దేవస్థానం పురోహితులు, దేవస్థానం సిబ్బంది, వివిధ ప్రాంతాల నుండి తరలి వచ్చిన వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

**-స్వామివారికి జిల్లా ఎస్పీ పూజలు..**

మన్యం కొండ శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి వారిని సోమవారం తెల్లవారుజామున జిల్లా ఎస్పీ డీ.జానకి దర్శించుకున్నారు. రథోత్సవ సందర్భంగా ఆమె దేవస్థానానికి వచ్చి రథోత్సవ ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. పోలీస్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.




## రాష్ట్రస్థాయికి ఎంపికైన వీరారెడ్డిపల్లి విద్యార్థి

జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 02 :

తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం అక్షర తెలుగు మీడియం విభాగంలో జిల్లా స్థాయి సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్ట్ లో జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు సత్యం తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో సత్యనారాయణ సర్టిఫికెట్, మెమొంటోను అందజేసినట్లు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండారి సత్యం గైడ్ టీచర్ విజయ్ కుమార్ ను అభినందించి హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు గీత, శ్రీనివాస్, జరీనా, భాను, బేగం, బిక్కం సాహెబ్, కచ్చిగల్ల మల్లయ్య, వసంత గ్రామస్తులు విద్యార్థిని అభినందించారు.

## పోమాల్ పల్లిలో శ్రీశ్రీశ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు

- స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



షాద్ నగర్, ఫిబ్రవరి 2 :

రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం పోమాల్ పల్లి గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శ్రీశ్రీశ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి వెంకటేశ్వర స్వామి వారి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోమాల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి, కొండారెడ్డిపల్లి సర్పంచ్ పల్లె ఆనంద్, మాజీ సర్పంచ్ సీనియర్ బీఆర్ఎస్ నాయకులు శేఖర్ పంతులు, తాండ్ర విష్ణు వర్ధన్ రెడ్డి, లింగం దాన సర్పంచ్ నాగిళ్ల వెంకటేష్, తూర్పు గడ్డ తండా సర్పంచ్ తుకారాం, లేమామామిడి సర్పంచ్ సులోచన శ్రీనివాస్, మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణు వర్ధన్ రెడ్డి, ఆంజనేయులు, మాజీ ఎంపిటిసిలు రాంచందర్, యాదయ్య, ఉపసర్పంచ్, సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు రాంరెడ్డి, సుదర్శన్, తాండ్ర నరేందర్ రెడ్డి, మన్మథ రెడ్డి, సాజీద్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు మెరుగైన వైద్యం అందించాలి

- ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి

జయభేరి, చింతపల్లి, ఫిబ్రవరి 02:




మహిళలకు మెరుగైన వైద్యం అందించాలని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అన్నారు. చింతపల్లి మండలం తీదేడు గ్రామంలోని పల్లె దవాఖానాలో జన ఆరోగ్య సమితి సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య దవాఖానాలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా వైద్య పరీక్షలను పరిశీలించారు. మహిళలకు బీపీ పరీక్ష చేయించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి మహిళ ఆరోగ్య మహిళా వైద్య పరీక్షలు చేయించుకునేలా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని అన్నారు. బిపి, షుగర్ వ్యాధి ఉన్న వారికి పల్లె దవాఖానా నుంచి ప్రతి నెల మందులు అందజేయాలని తెలిపారు. రక్తహీనత ఉన్న వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారికి ఐరన్, క్యాల్షియం వంటి మాత్రలు అందజేయాలని, ఐరన్ సమకూరే ఆహారాన్ని సూచించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్, మాజీ ఉప సర్పంచ్లు ధరణిపతి రమణారావు, ఉలుపాల శేఖర్ రెడ్డి, తీదేడు గ్రామ శాఖ అధ్యక్షుడు సోనగంటి గొవర్ధనాచారి, వార్డు సభ్యులు బొడ్డు పార్వతమ్మ యాదగిరి, మాదగోని కృష్ణ గౌడ్, గంటెల అలివేలు సోమయ్య, దాసరి కళమ్మ ముత్తయ్య, రెడ్డి పద్మ పరమేష్ ముదిరాజ్, మర్ల యాదగిరి, శివర్ల పర్వతాలు యాదవ్, గ్రామస్తులు సిమర్ల శ్రీను యాదవ్, మెరిక శంకరయ్య, వీరమల్ల జగదీష్, దాసరి మల్లయ్య, వీరమల్ల వెంకటయ్య, మొరుపోజు రాజు, కాయితి బుచ్చిరెడ్డి, కర్ణకోట కిషన్, కలగోని కిరణ్, మునగాల అశోక్, డాక్టర్ శ్రీదేవి, ఏఎన్ఎం రామలక్ష్మి, అంగన్వాడి టీచర్లు, ఆశావర్కర్లు, గ్రామస్తులు సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కావొద్దు

- ప్రముఖ సైకాలజిస్ట్ సుధీర్ సంద్ర
- పరీక్షలంటే ఒత్తిడికి గురి కాకుండా శ్రద్ధతో చదువుకోవాలి.. ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోనె హన్మంత్ రెడ్డి

జయభేరి, శామీర్ పేట్ :



విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా శ్రద్ధతో చదువుకుని ఉన్నత స్థాయిలో నిలబడాలని ప్రముఖ సైకాలజిస్ట్ సుధీర్ సంద్ర, ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోనె హన్మంత్ రెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా శామీర్ పేట, డివిజన్ పరిధిలోని మొగుళ్ళ వెంకట్ రాంరెడ్డి ఫంక్షన్ హాలులో శ్రీ అకాడమీ ఆఫ్ కామర్స్ అండ్ సైన్స్ మరియు జటాధర ఎడ్యుకేషనల్ టెక్నాలజీ కలిసి ట్రస్మా వారి సౌజన్యంతో 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

అనంతరం వారు మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తుండటంతో విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోకుండా శ్రద్ధగా చదవాలన్నారు. చదువే అన్నింటికి మూలాధారమని విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా శ్రద్ధతో చదువుకుని అటు తల్లిదండ్రులకు, ఇటు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఇక ఎండ వాన, చలి అనే తేడా లేకుండా మనల్ని రక్షిస్తున్న దేశ సైనికులు, మనకు ఆహారాన్ని అందించడానికి శ్రమిస్తున్న రైతులను ఆదర్శంగా తీసుకుని దేశ సేవలో పాలుపంచుకోవాలన్నారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాలకు సాధ్యమైనంత దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కమలాకర్, శ్రీ అకాడమీ కామర్స్ అండ్ సైన్స్ డైరెక్టర్ లు శ్రీనివాస్ రావు, శ్రీకాంత్, జటాధర ఎడ్యుకేషనల్ టెక్నాలజీ డైరెక్టర్ అరుణ్, పాఠశాల కరస్పాండెంట్లు శ్రీకాంత్ రెడ్డి, జంగారెడ్డి, శివశంకర్, ముత్తయ్య, శ్రావణ్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేట కాంగ్రెస్‌లో భగ్గుమన్న వర్గపోరు..!

- టికెట్ రాలేదని పెట్రోల్ పోసుకొని కాంగ్రెస్ నాయకుడి ఆత్మహత్యాయత్నం

జయభేరి, సూర్యాపేట ఫిబ్రవరి 2 :

సూర్యాపేట జిల్లాలోని కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు భగ్గుమంటున్నది.

మున్సిపల్ ఎన్నికలు సమీస్తున్న కొద్దీ ఆ పార్టీలో అసంతృప్త నేతలు తిరుగుబావుటాను ఎగరవేస్తున్నారు. తమకు టికెట్ కేటాయించకుంటే ఎలాంటి చర్యలకైనా సిద్ధమైని హెచ్చరిస్తున్నారు.

తాజాగా ఓ నేత తనకు మున్సిపల్ ఎన్నిల్లో టికెట్ కేటాయించలేదనే ఆవేదనతో ఆత్మహత్యా ప్రయత్నం చేశాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది.

వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రంలోని 25వ వార్డులో కాంగ్రెస్ టికెట్ ఇవ్వలేదని ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకుడు కోడి శివ యాదవ్ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

గత మున్సిపల్ ఎన్నికల్లో తనకు టికెట్ ఇవ్వకుండా వేరే వాళ్లకు ఇస్తే సపోర్ట్ చేశామన్నారు. కానీ, ప్రస్తుతం తనకు ఇవ్వాల్సి ఉండగా అలా కాకుండా రమేష్ రెడ్డి వర్గానికి చెందిన వ్యక్తికి ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.

# డబిల్ పూర్ లో మల్లారెడ్డి ఎన్నికల ప్రచారం

**జయభేరి, మేడ్చల్ :**



రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్ గా తీర్చి దిద్దిన మహనీయుడు కేసీఆర్ ను అధికారంలో ఉన్నామని అహంకారంతో కాంగ్రెస్ ప్రభుత్వం సిట్ నోటీసుల పేరిట వేధించడం అన్యాయమని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మేడ్చల్ నియోజకవర్గంలోని ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధి డబిల్పూర్, మైసిరెడ్డిపల్లి లో భారాస అభ్యర్థుల తరుపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన ర్యాలీ, రోడ్ షో, కార్నర్ మీటింగ్ లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలు రెండేళ్లలనే విసిగిపోయారని కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కాంగ్రెస్ నేతలు విఫలమయ్యారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటిల పేరుతో పేద ప్రజలను నిండా ముంచిందని అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా గ్యారెంటిల అమలు ఊసే లేదని మల్లారెడ్డి ఎద్దేవాచేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీ పాలనలో గ్రామాలను పట్టించుకోలేదని తను మంత్రిగా ఉన్న సమయంలో సొంత ఖర్చుతో గ్రామాలలో రోడ్లు, డ్రైనేజి వ్యవస్థ, ఆలయాల నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేశానన్నారు. మాజీమంత్రి కేసీఆర్ 10 ఏళ్ళ పాలనలో ఇంటింటికి మంచినీరు, 24గంటల విద్యుత్, రెండు వందల ఫించన్ ను రూ.2 వేల కు పెంచిన ఘనత కేసీఆర్ అని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటిలు ఎక్కడ పోయాయని ప్రశ్నించారు. మహిళలకు రూ.2500, ఆడబిడ్డకు ద్విచక్ర వాహనాలు, తులం బంగారం లాంటి ఉచిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి అందరిని మోసం చేసారని విమర్శించారు. రెండేళ్లుగా రాష్ట్రంలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి శూన్యం అన్నారు. ప్రజలు మున్సిపల్ ఎన్నికల్లో అభివృద్ధి చేసిన పార్టీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. మేడ్చల్ నియోజకవర్గంలో మూడు మున్సిపాలిటీలను బిఆర్ఎస్ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ బిఆర్ఎస్ ఇంచార్జ్ మహేందర్ రెడ్డి, నాయకులు భాస్కర్ యాదవ్, ముద్దుల శ్రీనివాస్ రెడ్డి, రాజమల్లారెడ్డి, భాగ్యరెడ్డి, అశోక్, యూనిస్ పాషా, తదితరులు పాల్గొన్నారు.



## అనిత ఆప్టికల్స్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

**❝ వైద్య శిబిరాన్ని పరవాడ ప్రాంత ప్రజలు ఉపయోగించుకోండి కంటి వైద్య నిపుణులు డాక్టర్ గోపికృష్ణ**

**జయభేరి, పరవాడ :**

మండల కేంద్రం అయ్యిన పరవాడ గ్రామం సినిమా హల్ జంక్షన్ నందు బుధవారం అనిత ఆప్టికల్స్ సెంటర్ నందు శంకర్ ఫౌండేషన్ విజన్ సెంటర్ మరియు అనిత ఆప్టికల్స్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తునట్టు కంటి వైద్య నిపుణులు కె గోపికృష్ణ తెలియజేసారు.వైద్య శిబిరాన్ని పరవాడ ప్రాంత ప్రజలు అందరూ ఉపయోగించుకోవాలని కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించి డాక్టర్ సలహా మేరకు శాస్ర చికిత్స జరగబడునని తెలియజేసారు.కంటి శుక్లల్లో సమస్య,కంటి మీద కండ ఉన్న,మెల్లకొన్ను సరిచేయ్యడం వంటి సమస్యలకు వైద్యులు సలహా మేరకు ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేయబడును అని ఈ కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు అందరూ వినియోగించుకోవాలని డాక్టర్ గోపి కృష్ణ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేసారు.

# మాజీ ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలోకి చేరికలు

**జయభేరి, దేవరకొండ :**



దేవరకొండ మున్సిపాలిటీ 2వ వార్డుకు చెందిన ఆనంద్ తోపాటు 50మంది బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ సమక్షంలో చేరికలు. దేవరకొండ మున్సిపాలిటీ 2వ వార్డుకు చెందిన ఆనంద్ తోపాటు 50మంది బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు, ఈ సందర్భంగా ఆయన వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....గత పదేండ్లలో కెసిఆర్ చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని చూసే ప్రజలంతా మళ్ళీ కేసీఆర్ పాలన కోరుకుంటున్నారు అని ఆయన అన్నారు.రెండేళ్లలో పైసా పని చెయ్యని దద్దమ్మ రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి మున్సిపల్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలి అని ఆయన అన్నారు.బిఆర్ఎస్ హయంలో కేసీఆర్ నాయకత్వంలోనే దేవరకొండ అభివృద్ధి జరిగింది అని ఆయన తెలిపారు.కేసీఆర్ ప్రభుత్వంలో నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 100కోట్లతో మున్సిపాలిటీలో అనేక పనులు చేపట్టాం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కేతావత్ బిల్యా నాయక్,నేనావత్ కిషన్ నాయక్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు TVN రెడ్డి, 2వ వార్డు అభ్యర్థి పొట్ట మురళి, బొడ్డుపల్లి కృష్ణ, రమావత్ తులిసీరామ్, వడత్య బాలు,శ్రీను,నేనావత్ నాగార్జున, పెద్దయ్య,అందుగుల సైదులు, కొమ్ము ఉదయ్,తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి పనులను పారదర్శకంగా చేపట్టాలి

**❝ వంగాల స్రవంతి రమేష్**

**జయభేరి, చింతపల్లి, ఫిబ్రవరి 02:**

చింతపల్లి మండలంలోని హోమంతాలపల్లి పంచాయతీలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను గ్రామ సర్పంచ్ వంగాల స్రవంతి రమేష్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ పరిధిలో చేపట్టనున్న ఉపాధి హామీ పనులను పరిశీలించిన సర్పంచ్ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ అభివృద్ధికి ఉపాధి హామీ పథకం ఎంతో కీలకమని, ఈ పథకం ద్వారా గ్రామీణులకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. అలాగే పనులు నాణ్యతతో, పారదర్శకంగా చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు, మధ్యాహ్న సమయంలో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామస్థులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## మధ్యతరగతి ప్రజలకు భరోసాగా కేంద్ర బడ్జెట్



**జయభేరి, పరవాడ:**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సాధారణ మధ్యతరగతి ప్రజలకు భరోసాని ఇవ్వడంతో పాటు ఆర్థికంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి స్థిరత్వాన్ని ఇచ్చేలా ఉందని బీజేవైఎం జిల్లా కార్యదర్శ మోస రామకృష్ణ ప్రకటన ద్వారా తెలియజేశారు.ఈ బడ్జెట్ లో దేశ ఆర్థిక వృద్ధికి అవసరమైన స్పష్టమైన దిశ కనిపిస్తోందని ముఖ్యంగా మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాల పెంపుపై ఎన్డిఏ ప్రభుత్వం చూపిన శ్రద్ధ అభినందనీయం అని మధ్యతరగతి ప్రజలకు ఊరట కలిగించే చర్యలు, రైతులకు మద్దతు ఇచ్చే విధానాలు. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులు అనగా పోలవరం అమరావతి గ్రామీణ రహదారులు బ్రిడ్జిస్ మొదలగు వాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భారీగా నిధులు రాబట్టేందుకు కృషిచేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ బడ్జెట్ దేశ ఆర్థిక స్థిరత్వాన్ని బలోపేతం చేస్తూ, అభివృద్ధి వైపు ముందుకు తీసుకెళ్లేలా ఉందని కేంద్రం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ దేశ భవిష్యత్తుకు ఉపయోగపడే బడ్జెట్ అని అంత మంచి బడ్జెట్ ప్రవేశపెట్టిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్కి కృతజ్ఞతలు తెలిపారు.

# సేవాసదనం నందు పెన్షనర్స్ పుట్టినరోజు వేడుకలు

**జయభేరి, దేవరకొండ :**




దేవరకొండ పెన్షనర్స్ సేవాసదనం నందు సభ్యులు గుద్దేటి లక్ష్మీనారాయణ రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు తన 73వైస్ పుట్టినరోజు వేడుక నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా వారిని కార్యదర్శి అంకం చంద్రమౌళి, జిల్లా కార్యదర్శి కంచర్ల నారాయణ రెడ్డి, కోశాధికారి పంగునూరు లింగయ్యలు షాలువ కప్పి, కిరీటం ధరింపచేసి, స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలియజేసినారు. ఉపాధక్షులు ఆకులపల్లి అజాక్, సంయుక్త కార్యదర్శి వనం బుచ్చయ్య కార్యనిర్వాహాక కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ షరీఫ్, ప్రచార కార్యదర్శి పగిడిమర్రి సత్యమూర్తి, మోటమర్రి పురుషోత్తం, మునిని వీరయ్య, అలంపల్లి శ్రీనివాసులు, అప్పం వీరయ్య, మొహమ్మద్ మౌలానా, మొహమ్మదలీ, గుమ్మడవల్లి కోటయ్య, కోర్వి లక్ష్మయ్య, వనం నరసింహ తదితరులు పాలుగోని శుభాకాంక్షలు తెలియజేసినారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నా పుట్టినరోజు వేడుకలు పాలుగోని శుభాకాంక్షలు తెలియజేసిన మిత్రులందరికీ కృతజ్ఞతలు తెలియజేసినారు. అందరికి స్వీట్స్ ఇచ్చి, తేనిటీ విందు ఏర్పాటు చేసినారు.

## బిఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించిన చల్లా ధర్మారెడ్డి

**జయభేరి, పరకాల, ఫిబ్రవరి 02 :**

పరకాల మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో పరకాల మాజీ శాసన సభ్యులు చల్లా ధర్మారెడ్డి 22 వార్డులకు సంబంధించిన భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) అభ్యర్థుల జాబితాను ప్రకటించారు.

వార్డుల వారీగా అభ్యర్థుల వివరాలు : 1వ వార్డు - వెంకటస్వామి దుబాసీ, 2వ వార్డు - బొచ్చు శ్యామల బాబురావు, 3వ వార్డు - పంచగిరి సృజన సుమంత్, 4వ వార్డు - కడారి జ్యోతి, 5వ వార్డు - గౌడుగు రజిత నాగరాజు, 6వ వార్డు - తుమ్మల రాణి రవి, 7వ వార్డు - దుంపేటి నాగరాజు, 8వ వార్డు - ఆడప రాము, 9వ వార్డు - బండారి కవిత కృష్ణ, 10వ వార్డు - పిట్ట స్వప్న దేవేందర్, 11వ వార్డు - మార్త విక్రమ్, 12వ వార్డు - గంట కళావతి వెంకటేశ్వర్లు, 13వ వార్డు - దగ్గు సునీత, 14వ వార్డు - పడిదెల దీప్తి రాకేష్. 15వ వార్డు - కందుకూరి వేణుగోపాలమూర్తి. 16వ వార్డు - బండి సారంగపాణి, 17వ వార్డు - శనిగరం రజిని నవీన్, 18వ వార్డు - రేగూరి కరుణ విజయపాల్ రెడ్డి, 19వ వార్డు - ఏకు బాబు (బొబ్బిలి), 20వ వార్డు - పాలకుర్తి గోపి, 21 వ వార్డు - ఒంటేరు చక్రపాణి (చక్రి), 22వ వార్డు - ఇంగిలీ వీరేష్.

## డ్వాక్రా భవనానికి భూమి పూజ చేసిన గ్రామ సర్పంచ్ ఎం. శ్రీను

**❝ డ్వాక్రా భవనం మంజూరు చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు దేవుని బండ తండా మహిళలంతా రుణపడి ఉంటారు**

**❝ మాట ఇచ్చిన విధంగా దేవుని బండ తండ గ్రామపంచాయతీకి త్వరలో సిసి రోడ్లు వేస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే శంకర్**



**జయభేరి, షాద్ నగర్, ఫిబ్రవరి 02 :**

షాద్ నగర్ నియోజకవర్గ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలంలో ఉన్నటువంటి దేవుని బండ తండ గ్రామపంచాయతీకి మహిళల సంక్షేమం కోసం మహిళా సంఘం కోసం మంజూరు అయిన డ్వాక్రా భవనానికి దేవునిబండ తండ గ్రామపంచాయతీ సర్పంచ్ ఎం శ్రీను భూమి పూజ చేశారు. డ్వాక్రా భవనం మంజూరు చేసిన ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ షాద్నగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే శంకర్ కు దేవుని బండ తాండ ప్రజలంతా రుణపడి ఉంటామని గ్రామ సర్పంచ్ ఎం శ్రీను అన్నారు. అదేవిధంగా అతి త్వరలో మన తాండను దృష్టిలో పెట్టుకొని మాట ఇచ్చిన ప్రకారం సిసి రోడ్లు కూడా వేయిస్తానని ఎమ్మెల్యే అన్నారని ఆయన తెలిపారు. తాండ ప్రజలంతా ఐక్యమత్యంతో ఉండి అందరూ కలిసిమెలిసి మన గ్రామ పంచాయతీని అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు. ఈ యొక్క కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ శ్యామ్ లాల్, అంగన్వాడీ టీచర్ సుమతి, బాదావత్ శంకర్, రూప్లా నాయక్, రమేష్, మంగమ్మ, సురేష్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# సరిగ్గా 20 ఏళ్ల క్రితం ఉపాధి హామీ పథకం అమల్లోకి

**❝ గ్రామీణుల వలసలు తగ్గుముఖం- ఇప్పటివరకు 180 కోట్ల పనిదినాల కల్పన**

**జయభేరి, ఏలూరు, ఫిబ్రవరి 2 :**

మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంఎన్ఆర్ఈజీఏ) ఉపాధికి గ్యారంటీ ఇస్తే, దాని స్థానంలో మోదీ సర్కారు తెచ్చిన కొత్త చట్టం అధికార కేంద్రీకరణకే గ్యారంటీ ఇస్తోందని కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు. ఉపాధి హామీ చట్టం లక్ష్యాలకు తూట్లు పొడిచేలా 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ చట్టం 2025' ఉందని ఆయన ఆరోపించారు. నేటికి (ఫిబ్రవరి 2) సరిగ్గా 20 ఏళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్ జిల్లా బద్నాపల్లి గ్రామంలో ప్రారంభమైన ఉపాధిహామీ పథకం విప్లవాత్మకమైందన్నారు. తొలి ఉపాధి హామీ కార్డును ఆ ఊరికి చెందిన దళిత మహిళ చీమల పెద్దక్క అందుకుందని జైరాం రమేశ్ తెలిపారు. ఈమేరకు సోమవారం ఎక్స్ వేదికగా ఒక ట్వీట్ చేశారు. 'ఇకపై దేశంలోని ఏయే జిల్లాలకు ఎన్నెన్ని ఉపాధి హామీ పని దినాలను కేటాయించాలి అనేది దిల్లీలోని మోదీ సర్కారే డిసైడ్ చేస్తుంది. ప్రజల డిమాండ్‌ను, అవసరాలను ఈ సర్కారు పట్టించుకోదు. కేవలం కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులకు అనుగుణంగా పనిదినాలను కల్పిస్తారు. వ్యవసాయ సీజన్‌లోని దాదాపు రెండు నెలల పాటు ఈ స్కీం అమల్లో ఉండదు. ఇది ఎంతోమంది గ్రామీణ నిరుపేదలకు బ్యాడ్ న్యూస్. దీనివల్ల ఆ రెండు నెలల వ్యవధిలో వారు వ్యవసాయ పనులు చేసినా, న్యాయమైన వేతనాలను అడిగి తీసుకునే పరిస్థితి ఉండదు. ఇకపై ఉపాధి హామీ పథకంలో గ్రామ పంచాయతీల పాత్ర కూడా ఉండదు. నేరుగా మోదీ సర్కారే అన్నీ నిర్ణయిస్తుంది. రాష్ట్రాలు ఇక నుంచి ఈ పథకం ఖర్చుల్లోని 40 శాతం భాగాన్ని భరించాల్సి ఉంటుంది.

చాలా రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి బాగా లేదు. కొన్ని రాష్ట్రాలు ఈ 40 శాతం నిధులను ఇవ్వడం ఆపేసే ముప్పు సైతం ఉంది' అని జైరాం రమేశ్ పేర్కొన్నారు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 41 స్ఫూర్తితో ఉపాధి హామీ పథకం చట్టాన్ని గతంలో కాంగ్రెస్ సర్కారు చేసింది. దీని ప్రకారం ప్రతి సంవత్సరం కనీస ఉపాధి పనిదినాలను పొందడం దేశ ప్రజల హక్కు. పనిని కల్పిస్తాం అనేది ప్రభుత్వ హామీ మాత్రమే కాదు. అది ప్రజా డిమాండ్ ఆధారిత చట్టపరమైన గ్యారంటీ. అంటే పని కోసం ప్రభుత్వాన్ని ప్రజలు డిమాండ్ చేయొచ్చు. కాంగ్రెస్ హయాంలో ఉపాధి హామీ పనులను గ్రామపంచాయతీల స్థాయిలో ఎంపిక చేసేవారు.

ప్రజలు తమ డిమాండ్‌ను గ్రామ పంచాయతీలకు చెప్పుకునే అవకాశం ఉండేది. మోదీ సర్కారు తెచ్చిన కొత్త చట్టం వల్ల ఇకపై ఆ అవకాశం ఉండదు. ఎందుకంటే అంతా దిల్లీలోనే డిసైడ్ అవుతుంది. అప్పట్లో ఉపాధి హామీ పథకం వ్యయాల్లో రాష్ట్రాలు కేవలం 10 శాతం భాగాన్నే భరించేవి. దేశంలో జరిగిన ఉపాధి హామీ పనులపై గ్రామ పంచాయతీల స్థాయిలో సామాజిక తనిఖీలు జరిగేవి. వీటిపై అత్యున్నత స్థాయిలో కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) ద్వారా ఆడిట్‌లు నిర్వహించేవారు' అని జైరాం రమేశ్ తెలిపారు.గత రెండు దశాబ్దాల వ్యవధిలో ఉపాధి హామీ పథకం ద్వారా 180 కోట్ల పనిదినాలను దేశ ప్రజలు పొందారు. ప్రత్యేకించి గ్రామీణ మహిళలు ఈ పథకం వల్ల ఉపాధి అవకాశాలను పొందారు. దీని ద్వారా చేపట్టిన పనుల ఫలితంగా దేశంలో దాదాపు 10 కోట్ల ప్రజా ఆస్తులు ఏర్పడ్డాయి. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల ప్రజల వలసలు గణనీయంగా తగ్గాయి. పర్యవసానంగా గ్రామ పంచాయతీలు బలోపేతమై, గ్రామీణ పేదలు పనిచేసే ప్రదేశాల్లో అధిక వేతనాలను డిమాండ్ చేసే పరిస్థితి వచ్చింది' అని జైరాం రమేశ్ చెప్పారు.

## బిఆర్ఎస్ లో చేరికల జోరు

**❝ కాంగ్రెస్ కు రాజీనామా చేసిన జాలా రవీందర్ రెడ్డి**



**జయభేరి, పరకాల, ఫిబ్రవరి 02 :**

పరకాల మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో పరకాల పట్టణంలో భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీలో చేరికల జోరు కొనసాగుతోంది. సోమవారం పరకాల మున్సిపాలిటీ 1వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు టాటా మాజిక్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ బొచ్చు సంపత్, సోషల్ మీడియా కన్వీనర్ బొచ్చు వరప్రసాద్, బూత్ ఇంచార్జ్ బొచ్చు సుభాష్ లతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బిఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ చేరికలు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, పరకాల మున్సిపాలిటీ ఎన్నికల సమన్వయకర్త, రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిపెల్లి వాసుదేవ రెడ్డి సమక్షంలో జరిగాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పరకాల పట్టణ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి బిఆర్ఎస్ పార్టీనే సరైన వేదిక అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులే నేటికీ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్ లో ఏపీకి పెద్దపీట

**జయభేరి, పెనుకొండ :**

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ లో రాష్ట్రానికి పెద్ద పీఠ వేశారని మంత్రి సవిత పేర్కొన్నారు. పెనుకొండలోని క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోడీ అన్ని రాష్ట్రాలకు, బడుగు బలహీన వర్గాలకు ఈ బడ్జెట్ ను ప్రతిపాదించారని తెలిపారు. నిర్మల సీతారామన్ 9సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత దక్కించుకున్నారని అన్నారు.

